క్లుప్తంగా

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీఐ సత్యబాబు

వెదురుకుప్పం: ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ సత్యబాబు హెచ్చరించారు. బుధవారం చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలను వినియోగించకూడదని సూచించారు. అనంతరం ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద మాట్లాడుతూ ర్యాగింగ్ చేయడం అమానుషమని అలాంటి చర్యలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో యాంటీ ర్యాగింగ్ విభాగం సమన్వయకర్త సతీష్ కుమార్, ఎస్ఐ వెంకటకృష్ణ, ఐక్యూసీ కో–ఆర్డినేటర్ వెంకటేష్ పాల్గొన్నారు.

బాధ్యతగా చేనేతకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ విజయులురెడ్డి

కార్వేటినగరం : ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి బాధ్యతగా చేనేత పరిశ్రమను ప్రోత్సహించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ధనంజయరెడ్డి పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం



తల్లిపాల వారోత్సవ ర్యాలీ

విజయపురం: పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేష్టమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి అన్నారు. బుధవారం కేసవపురంలో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గర్భవతులకు, బాలింతలకు తల్లిపాల విశిష్టతను వివరించారు. పుట్టిన మొదటి రోజు నుంచే బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. ముర్రుపాలలో రోగ నిరోధక శక్తి ఉంటుందని గుర్తుచేశారు. అనంతరం గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారం అందజేశారు. టీచర్ మణి, ఎంఎల్‌హెచ్‌పీ, అంగన్‌వాడీ కార్యకర్త సరస, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

శుద్ధ జలం అందించడమే లక్ష్యం



పైప్‌లైన్‌కు పరికరాలు అమర్చుతున్న సిబ్బంది

పాలసముద్రం : ప్రజలకు శుద్ధ జలం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, అందులో భాగంగా ఇన్‌లైన్ క్లోరినేషన్ వాటర్‌లైన్ ఏర్పాటు చేస్తున్నామని సర్పంచ్ అయ్యప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హిమంతుకుమార్ తెలిపారు. బుధవారం రాచపాళ్యం గ్రామానికి తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బోరు మోటార్ పైప్‌లైన్‌కి క్లోరినేటెడ్ వాటర్‌సప్లై పరికరాలను అమర్చారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శి ధరణి ప్రసాద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అచ్చయ్ పాల్గొన్నారు.

నోటు పుస్తకాల వితరణ

విజయపురం: మండలంలోని బూచివానత్తం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు రిటైర్డ్ హెచ్‌ఎం చంద్రయ్య నోటుపుస్తకాలు వితరణ చేశారు. బుధవారం పాఠశాల హెచ్‌ఎం సురేష్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో టీచర్ చలపతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యతతో ఉపాధి పనులు



మాట్లాడుతున్న ఏపీఓ మార్గరెట్

పాలసముద్రం : ఉపాధి హామీ కింద పనులను నాణ్యతగా చేయాలని ఏపీఓ మార్గరెట్ తెలిపారు. బుధవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఏపీఓ మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఏడాదికి 100 రోజులు పనులు కల్పిస్తామన్నారు. మస్టర్‌లో కొట్టివేతలు లేకుండా కూలీలు హాజరు నమోదు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. కూలి సొమ్ము సక్రమంగా రావాలంటే ఆన్‌లైన్‌లో ఫొటోలను అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో జేఈ అనుషా పాల్గొన్నారు.

కర్షకుడికి అండగా కియోస్క్

రైతు సంక్షేమమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేసింది. సాగును సంబరంగా మార్చేందుకు విశేషంగా కృషి చేసింది. అందులో భాగంగా అన్నదాతలకు కియోస్క్ యంత్రాలను ఆర్‌బీకేల ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చింది. భూసార పరీక్ష నుంచి అధిక దిగుబడి సాధించేందుకు అవసరమైన అన్ని రకాల సేవలను పల్లెముంగిటకే చేర్చింది. అలాగే ఈ యంత్రాల ద్వారా ఎరువులు.. పురుగుమందులను ముందస్తుగా బుక్ చేసుకునే వెసులబాటు కల్పించింది. పండించిన పంటలను గిట్టుబాటు ధరకు విక్రయించుకునేందుకు సహకారం అందించింది.

- రైతుల కోసం ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఈ యంత్రం ద్వారా ఎరువులు, పురుగు మందులు బుక్ చేసుకునే అవకాశం
- అందుబాటులోకి సమగ్ర సమాచారం



కార్వేటినగరం ఆర్బీకేలో కియోస్క్ యంత్రం

కార్వేటినగరం : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలిచింది. రైతు సంక్షేమం కోసం నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో రకాల సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసే అన్నదాతలు అధిక దిగుబడి సాధించేందుకు సహకారం అందించారు. అందులో భాగంగా వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పొందేందుకు కియోస్క్ యంత్రాలను తీసుకువచ్చారు.

అందుబాటులో సమాచారం

రైతు భరోసా కేంద్రాల్లో డాక్టర్ వైఎస్సార్ సమీకృత వ్యవసాయ ప్రయోగశాలల సమాచారం అందుబాటులో ఉంచారు. ఏ భూమిలో ఏ పంట సాగు చేయాలి, దానికి సంబంధించిన విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులు, పశువులకు వచ్చే రోగాలకు సంబంధించి అన్ని ప్రయోగాలు కియోస్క్ యంత్రం ద్వారా తెలుసుకోవచ్చు.

దళారుల బెడద తప్పింది

గతంలో రైతులు పండించిన పంటకు కొనుగోలు కేంద్రాలు ఎక్కడ ఉన్నాయో తెలియక రైతులు ఇబ్బందులు పడి దళారుల చేతిలో మోసపోయేవారు. కానీ ఆ పరిస్థితి లేకుండా కియోస్క్ ద్వారా సమీపంలోని కొనుగోలు కేంద్రాల సమాచారం లభిస్తుంది.

వాతావరణ సమాచారం

ఈ యంత్రం ద్వారా వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంది. రైతు భరోసా కేంద్రాల పరిధిలో కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు, వర్షపాతం వివరాలు తెలియజేస్తుంది. దానికి అనుగుణంగా రైతులు ఏ విధమైన చర్యలు చేపట్టవచ్చో సులభంగా తెలుసుకోవచ్చు.

ముందస్తుగా బుకింగ్

కియోస్క్ యంత్రాల ద్వారా ప్రకృతి వ్యవసాయం సాగు చేసే విధానం, మూగజీవాలకు అంబులెన్స్, పంటల కొనుగోలు వంటి సమాచారం తెలుసుకోవచ్చు. ఎరువులు, పురుగు మందులను ముందస్తుగా బుక్ చేసుకోవచ్చు.

అన్ని రకాల సేవలు



రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలు రైతులకు ఎంతో ఉపయోగకంగా ఉంటున్నాయి. దీని ద్వారా తొమ్మిది రకాల ప్రయోజనాలు చేకూరుతున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుని రైతులు ఆర్థిక ప్రగతి సాధించవచ్చు. గ్రామ స్థాయిలో అన్ని రకాల సేవలు లభించడంలో రైతులు సంతోషంగా ఉంటున్నారు.

– హేమలత, ఏఓ, కార్వేటినగరం

ఎన్నికలకు సర్వం సిద్ధం



సమావేశంలో మట్లాడుతున్న ఎంఈఓ

నింద్ర: నేడు జరిగే ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓలు వసుమతి, శ్రీధర్‌రాజు తెలిపారు. మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలో గురువారం జరిగే 46 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను నిర్వహించాల్సిన బాధ్యత హెచ్‌ఎంలపై వుందని అన్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సభ్యుల ఎన్నిక, 1.30 గంటలకు, చైర్మన్ ఎన్నిక జరుగుతుందన్నారు. అనంతరం 3 గంటలకు పాఠశాల యాజమాన్య నూతన కమిటీ ప్రథమ సమావేశం నిర్వహిస్తారన్నారు. ఈ ఎన్నిక నిర్వహణకు మండలంలోని మొత్తం పాఠశాలలను నాలుగు రూట్‌లుగా విభజించి మెదటి రూట్‌కు ఎంపీడీఓ, రెండవ రూట్‌కు తహసీల్దార్, మూడవ రూట్‌కు ఎంఈఓ–1, నాల్గవ రూట్‌కు ఎంఈఓ–2 టీమ్ లీడర్లుగా వ్యవహరిస్తారన్నారు. ప్రతి పాఠశాలకు పర్యవేక్షకులుగా స్థానిక వీఆర్‌ఓ, వీఆర్‌ఏ, పంచాయతీ కార్యదర్శులను నియమించినట్లు తెలిపారు. అదేవిధంగా పర్యవేక్షకులు వారికి కేటాయించిన పాఠశాలల్లో ఉదయం 7 గంటలకు హాజరు కావాలని, ఎక్కడైనా సమస్య వుంటే అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

ప్రతి కుటుంబానికి తపాలా సేవలు

నగరి: పొదుపుతో పాటు బీమా రక్షణ కల్పించే దిశగా ప్రతి కుటుంబానికి తపాలా శాఖ అండగా నిలుస్తోందని పుత్తూరు ఉప తపాలా అధికారి సతీష్ తెలిపారు. నగరి తపాలా కార్యాలయంలో బుధవారం డాక్ చౌపల్ (తపాలా అనుబంధం) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానికులను, ఉద్యోగులను, మహిళలను, యువకులను కార్యాలయానికి ఆహ్వానించి, తపాలా శాఖ సేవలను వివరించి, ఖాతాలను ప్రారంభించారు. తపాలా ఇన్‌స్పెక్టర్ సతీష్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి మహానగరాల వరకు ఇంటి వద్దకే తపాలా శాఖ సేవలను అందిస్తోందని అన్నారు. ఉత్తరాల బట్వాడాతో పాటు పొదుపు, బ్యాంకింగ్, బీమా సేవలను తపాలా సిబ్బంది ఇంటి వద్దకే అందిస్తున్నారని అన్నారు. తక్కువ ప్రీమియంతో టాటా, బజాజ్, నోవా బొప్ప, ఆదిత్య బిర్ల ప్రముఖ బీమా కంపెనీలతో కలిసి ప్రమాద బీమాను తపాలా శాఖ ద్వారా మాత్రమే పొందే అవకాశం ఉందన్నారు. సమీపంలోని తపాలా కార్యాలయాలను సందర్శించి, సేవలను పొందాలని సతీష్ కోరారు. మెయిల్ ఓవర్సీస్ మురళి, తపాలా సిబ్బంది పాల్గొన్నారు.



మహిళా పోలీస్‌కు సుకన్య ఖాతా పాస్‌బుక్ అందిస్తున్న సతీష్

స్వాతంత్య్ర పోరాటంలో చరఖాది ప్రధాన పాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

నగరి: స్వాతంత్ర్య పోరాటంలో చరఖాది ప్రధాన పాత్ర అని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డా. వేణుగోపాల్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల సాంస్కృతిక విభాగం వారు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత దేశం ఐక్యంగా స్వాతంత్ర్యం సాధించడంలో చరఖా ఒక చిహ్నంగా పనిచేసిందన్నారు. ఇప్పటికీ కుటీర పరిశ్రమగా ఉద్యోగ అవకాశాలను సృష్టించడంలో, ప్రజలకు ఉపాధి కల్పించడంలో, ప్రజల జీవన ప్రమాణాలను పెంచడంలో వ్యవసాయం తర్వాత, చేనేతకు ప్రముఖ స్థానం ఉందన్నారు. వందేమాతరం, సహాయ నిరాకరణ ఉద్యమాలలో చేనేత వస్త్రాలు, చరఖా ముఖ్యపాత్ర వహించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. భాస్కరరాజు తెలిపారు. చేనేత ఉత్పత్తుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడానికి, వాటి ఉపయోగం, వినియోగం ప్రోత్సహించడానికి చేనేత దినోత్సవాన్ని ప్రతి ఏడాది కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కళాశాల సాంస్కృతిక విభాగం అధిపతి డా.అరుణ కుమారి తెలిపారు. కళాశాల అకడమిక్ కో–ఆర్డినేటర్ డా. మహేశ్వరి, అధ్యాపకులు డా.స్వాతి, డా.శ్రీలక్ష్మి, డా.పంకజ, డా.రేవతి, డా.నరసయ్య, ఉమా మహేశ్వరి, మునికుమారి, ఝాన్సీ, బాషా పాల్గొన్నారు.

ఇంటి పట్టాల సమస్యలను పరిష్కరించండి

విజయపురం: ఇంటి పట్టాల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటీయూసీ మండల సమితి అధ్యతన నూతన తహసీల్దార్‌ను మర్యాద పూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని, పాతఆర్మాడు ఇంటి స్థలాలు ఇప్పించాలని కోరారు. దీనిపై తహసీల్దారు సానుకూలంగా స్పందించారు. తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను న్యాయబద్ధంగా ఉంటే పరిష్కరిస్తానని తెలిపారు. ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు రవి, కార్యదర్శులు ఏసుపాదం పాల్గొన్నారు.



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నేతలు

వేగవంతంగా ఉపాధి పనులు



అధికారులతో మాట్లాడుతున్న పీడీ

యాదమరి (పూతలపట్టు): యాదమరి మండలంలో ఉపాధి పనులను వేగవంతం చేయాలని డ్వామా పీడీ ఎన్.రాజశేఖర్ ఆదేశించారు. ఆయన బుధవారం మండలంలోని జంగాలపల్లి పంచాయతీలో నిర్వహించనున్న క్యాటిల్ పాండ్ పనులను తనిఖీ చేశారు. మాధవరం పంచాయతీలో చేపడుతున్న ఫిష్ పాండ్ పనులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్నటువంటి కూలీలకు ఉపాధిని కల్పించాలన్నారు. తద్వారా గ్రామాల్లో మరిన్ని ఉపాధి పనులను చేపట్టవచ్చని తెలిపారు. పని సమయంలో కూలీలు అందుబాటులో ఉండాలని చెప్పారు. వారికి క్రమం తప్పకుండా వేతనాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పెద్ద చెరువు కట్టను పరిశీలించారు. చెరువు కట్ట ఇరువైపులా ఉన్న కలుపు మొక్కలు, చెట్లను తొలగించి, ప్రజలు నడిచి వెళ్లడానికి వీలుగా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఏపీడీ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నగరి: అభివృద్ధికి అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. బుధవారం స్థానిక వెలుగు సమావేశ మందిరంలో ఎంపీపీ భార్గవి అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితమని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేసుకుంటూ అధికారులు ముందుకువెళ్లాలన్నారు. అనంతరం ఎంపీడీఓ సతీష్ సూచనల మేరకు ఆయా శాఖల అధికారులు వారి శాఖల్లో జరుగుతున్న పనులను వివరించారు. జెడ్పీటీసీ గాంధీ, వైస్ ఎంపీపీ కన్నియప్ప, తహసీల్దార్ రవికుమార్, ప్రత్యేక అధికారి వాసు, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ పనుల పరిశీలన



అన్నా కాంటీన్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

పుత్తూరు: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో ప్రారంభమైన అన్నా క్యాంటీన్ నిర్మాణ పనులను బుధవారం మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ రూ.46.67 లక్షల వ్యయంతో అన్నా క్యాంటీన్ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. మున్సిపల్ డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైల్వే కన్సల్టేటివ్ కమిటీ మెంబర్‌గా బాబు



మెంబర్ షిప్ కార్డును అందుకొంటున్న బాబు

పుత్తూరు: దక్షిణ రైల్వే స్టేషన్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా పుత్తూరుకు చెందిన బీజేపీ జిల్లా కార్యదర్శి కోటకొండ బాబును నియమిస్తూ చెన్నై డివిజన్ అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ జె.శ్రీవిద్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మెంబర్ షిప్ కార్డును బుధవారం స్థానిక రైల్వేస్టేషన్ మాస్టర్ పంకజ్‌నాయక్ బాబుకు అందజేశారు. ఆయన ఈ పదవిలో రెండేళ్ల పాటు కొనసాగుతారు. రైల్వేస్టేషన్ల అభివృద్ధిలో స్థానిక ప్రజల తరపున భాగస్వామిగా వ్యవహరిస్తారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం



విరాళం అందిస్తున్న దాత

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన అన్నదాన ట్రస్టుకు బుధవారం చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లెకు చెందిన బాలగురునాథం రూ.1,00,116 విరాళం అందజేశారు. అనంతరం అధికారులు దాత కుటుంబసభ్యులకు స్వామి దర్శనం కల్పించి ఆశీర్వచనాలు అందించారు. ఈఓ వెంకటేశు, సిబ్బంది వాసు, కోదండపాణి, విఘ్నేష్ పాల్గొన్నారు.

17న హుండీ లెక్కింపు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన హుండీ ఈనెల 17న లెక్కిస్తున్నట్లు ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం 7 గంటలకు ఆలయ మండపంలో లెక్కింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ అధికారులు, సిబ్బంది తప్పక హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

ద్రౌపదీదేవి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ





పురవీధుల్లో ఊరేగుతున్న విఘ్నేశ్వరస్వామి, అమ్మవారికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

- భక్తుల స్వహస్తాలతో అమ్మవారికి పాలాభిషేకం
- పురవీధుల్లో దర్శనమిచ్చిన గణనాథుడు

పుత్తూరు: ద్రౌపదీదేవీ సమేత శ్రీధర్మరాజుల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ జరిగింది. ఉదయం 6 గంటలకు అర్చకులు శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. 9 గంటలకు పుత్తూరు పట్టణానికి చెందిన వన్నెరెడ్డి సమన్వయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల కలశాలు, పట్టువస్త్రాలతో స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వచ్చారు. ఉత్సవమూర్తి ద్రౌపదీదేవి అమ్మవారికి మహిళలు తమ స్వహస్తాలతో పాలాభిషేకం చేశారు. అనంతరం అర్చకులు శ్రీద్రౌపదీదేవీ సమేత శ్రీధర్మరాజులస్వామి వార్లను పట్టు పీతాంబరాలు, విశేష సర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ఆవరణలో ముద్దుకృష్ణారెడ్డి, అమ్ము దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భాగవతారిణి స్వర్ణలతచే హరికథా గానం జరిగింది. రాత్రి 7 గంటలకు విఘ్నేశ్వరస్వామిని వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించి, మంగళవాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల సందడి నడుమ పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు వినాయకస్వామికి నారికేళ్ల కర్పూర నీరాజనాలు సమర్పించారు.

నేడు ద్రౌపదీదేవి పుట్టింటికి పయనం..

గురువారం ద్రౌపదీదేవి జన్మస్థలమైన చౌటూరు గ్రామానికి వెళ్లి, పరిసర గ్రామాల భక్తుల నుంచి పసుపు కుంకుమ, సారె తీసుకొని ఊరేగింపుగా ఆలయానికి తిరిగి వస్తారని. సాయంత్రం కామధేనువు వాహనంపై శ్రీరుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



పాల కలశాలు, పట్టువస్త్రాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

పుత్తూరు: చేతి వృత్తుల్లో శిక్షణతో పాటు రుణాలు పొందుతున్న మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ హరిత కోరారు. బుధవారం శుక్రవారం స్థానిక రాస్ కార్యాలయంలో జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రాస్ సంస్థ ఉచిత శిక్షణతో పాటు అవసరమైన వస్తువులను సైతం అందించడం హర్షనీయమన్నారు. వివిధ రంగాల్లో శిక్షణతో పాటు రుణాలను అందిస్తున్న నేపథ్యంలో మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించడానికి కృషిచేయాలని చెప్పారు. రాస్ జన్ శిక్షణ్ సంస్థాన్ సభ్యులైన 40 మందికి 84 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇదివరకు శిక్షణ పొందిన సభ్యులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. జన శిక్షణ సంస్థాన్ అధికారి హరి, రాస్ అధికారి రవి, సిబ్బంది ప్రకాష్, దివాకర్, మునిశేఖర్, జయంతి, బాలమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ హరిత



శిక్షణ తరగతులకు హాజరైన మహిళలు

వైభవంగా దీపపు పూజ

నగరి: మున్సిపల్ పరిధి చింతలపట్టెడ ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో నిర్వహిస్తున్న తిరనాళ్లలో భాగంగా బుధవారం దీపపు పూజ వైభవంగా నిర్వహించారు. 750 మంది మహిళలు దీపాలతో ఊరేగింపుగా వచ్చి ధర్మరాజుల స్వామి ఆలయంలోకి రావడం ప్రత్యేకత సంతరించుకుంది. ఆలయ ఉత్సవ మండపం వద్ద అధిక సంఖ్యలో ఆశీనులైన మహిళలు ఉత్సవ నిర్వాహకులు అందించిన అమ్మవారి చిత్రపటాల ముందు దీపాలు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. దీపపు పూజల అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు కుంకుమ ప్రసాదాలు అందించారు. ఉత్సవ నిర్వాహకులు డాక్టర్ నటరాజన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



దీపపు పూజ నిర్వహిస్తున్న మహిళలు

ముమ్మరంగా పారిశుధ్య పనులు

విజయపురం: మండలంలోని శ్రీహరిపురం, ఆలపాకం, కేవీపురం పంచాయతీలో బుధవారం పారిశుధ్య పనులు ముమ్మరంగా జరిగాయి. ఆయా పంచాయతీ కార్యదర్శులు వీధుల్లో పర్యటించి మురికి కాలువలో పూడికతీత పనులు, పిచ్చిమొక్కలను సిబ్బందితో తొలగించారు. ఓవర్ హెడ్ ట్యాంక్ చుట్టూ ఉన్న ముళ్ల పొదలు, పేడ దిబ్బలను యంత్రాల ద్వారా తొలగించారు.



శ్రీహరిపురంలో మొక్కలను తొలగిస్తున్న జేసీబీ

వేడుకగా పీర్ల పండుగ

పాలసముద్రం : మండలంలోని రాచపాళ్యం మసీదులో ముస్లింలు బుధవారం వేడుకగా పీర్ల పండుగ జరుపుకున్నారు. పీర్లను మసీదు నుంచి గుండు బావి క్రాస్ వరకు ఊరేగించారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం